సాక్షి
నంద్యాల
మంగళవారం : 21 : మే : 2024



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేలాది మందితో ఆలయ ప్రాంగణాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.



నందీశ్వరుడికి విశేష పూజలు

శ్రీశైలం: ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు సోమవారం జలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నానబెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.



పల్లెలకు ప్రగతి బాటలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామీణ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాలు అధ్వానంగా ఉన్న పల్లె బాటలు అభివృద్ధి చెందుతున్నాయి. 8లో▶

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత

● జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల: ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూముల డోర్‌లకు అదనపు భద్రత నిమిత్తం ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ నిమిత్తం వచ్చే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ సంబంధిత రిటర్నింగ్ అధికారి ఇచ్చిన గుర్తింపు కార్డుతో పాటు వ్యక్తిగత ధ్రువీకరణ కార్డును కూడా చూపాల్సి ఉంటుందన్నారు. కళాశాలలకు వెళ్లే మార్గాల్లో వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈవీఎంల భద్రత నిమిత్తం డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

ఘనంగా ద్వాదశి వేడుకలు



అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో ద్వాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా సోమవారం రాఘవేంద్రుల మూలబృందావనానికి విశేష పుష్ప, పంచామృతాభిషేకాలు చేశారు. బంగారు కవచాలతో విశిష్టంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు పట్టారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా పండితుల, అర్చకులు, బ్రాహ్మణులు, సేవా భక్తులు ఉపవాస దీక్షలో కొనసాగారు. ద్వాదశి సందర్భంగా శ్రీమఠం ఉదయం 8గంటల నుంచే అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ద్వాదశి వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నెలాఖరుకల్లా మండల కేంద్రాలకు 'విద్యాకానుక'

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా అందించే విద్యాకానుక కిట్లు ఈనెలాఖరు కంతా అన్ని మండల కేంద్రాలకు చేరుతాయని నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ లలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాకానుకలో భాగంగా నంద్యాల జిల్లాకు సంబంధించిన నోట్ పుస్తకాలు ఎస్సీజీ పాఠశాలలోని స్టాక్ పాయింట్‌కు చేరాయని పేర్కొన్నారు.

టీబీ డ్యామ్‌లో తగ్గిన నీటిమట్టం

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి మట్టం తగ్గింది. జలాశయం నుంచి కాలువలకు నీటి విడుదలను నిలిపేసినా కొద్దిరోజులుగా ఆవిరి రూపంలో నీటిమట్టం తగ్గింది. సోమవారం నాటికి 1,577.53 అడుగుల వద్ద 3.388 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎన్నికలకు ముందు అడ్డుకున్న చంద్రబాబు

- పోలింగ్ ముగిసిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు
- కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- వైఎస్‌ఆర్ ఆసరా పెండింగ్ నిధులు బ్యాంకు ఖాతాలకు జమ
- ఆసరాతో పాటు విద్యా దీవెనకు నిధులు
- మహిళల బ్యాంకు ఖాతాలకు వైఎస్‌ఆర్ చేయూత నిధులు
- రబీలో ఉమ్మడి జిల్లాలో 31 మండలాల్లో కరువు
- ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎన్యూమరేషన్ జాబితాలు



ఆస్పరిలోని సీఎస్‌పీ కేంద్రం వద్ద క్యూ కట్టిన రైతులు, మహిళలు

సజావుగా సంక్షేమం

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికలు ముగిసిన తర్వాత అప్పటి వరకు కొనసాగిన సంక్షేమాన్ని పట్టించుకునే ప్రభుత్వాలు చాలా అరుదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇందుకు అతీతం. పోలింగ్ ముగిసిన వెంటనే సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుండటం విశ్వసనీయతకు అద్దం పడుతోంది. ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేసేందుకు ప్రయత్నించినా టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తీసుకొచ్చి అడ్డుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలింగ్ ముగిసిన వెంటనే ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో ఆయా సంక్షేమ పథకాల నగదును జమ చేస్తోంది. 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కరువు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇదివరకే విడుదలైంది. స్వయం సహాయక సంఘాలకు కూడా వైఎస్‌ఆర్ ఆసరా పెండింగ్ నిధులు సంఘాల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఆసరాతో పాటు విద్యా దీవెన నిధులు కూడా విడుదలయ్యాయి. వైఎస్‌ఆర్ చేయూత నిధులు సోమవారం నుంచి మహిళల బ్యాంకు ఖాతాలకు విడుదలవుతుండటం విశేషం. తాజాగా 2023-24 రబీ కరువు మండలాలకు సంబంధించి రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం చేపట్టింది.

ఎన్యూమరేషన్‌పై 'పచ్చ' రాతలు

2023-24 రబీ సీజన్ ఎప్పుడో ముగిసిపోయింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు. పంటలే లేని సమయంలో ఎన్యూమరేషన్ ఎలా చేస్తారంటూ పచ్చ మీడియా అవగాహన లోపంతో విమర్శలు చేస్తోంది. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎస్‌డీఆర్‌ఎఫ్ నామ్స్ ప్రకారం అర్హులైన రైతులను గుర్తిస్తారు. ఆర్‌బీకేల వారీగా ఈ ప్రక్రియను ఈ నెల 24వ తేదీ లోపు పూర్తి చేస్తారు. క్షేత్రస్థాయికి ఎవరూ వెళ్లరు. ఈ-క్రాప్ డేటాను ప్రామాణికంగా తీసుకొని స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫండ్(ఎస్‌డీఆర్‌ఎఫ్) నిబంధనల ప్రకారం 33 కాలమ్స్ ప్రొఫార్మలో ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హత మేరకు రైతుల వివరాలను నమోదు చేస్తారు. వివరాలు ఈ నెల 25న ఆయా జిల్లాల వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు చేరుతాయి. ఈ నెల 25 నుంచి ఆర్‌బీకేల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులైన వారి జాబితాలను సోషల్ ఆడిట్ చేపడతారు. వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత ఈ నెల 29న రబీ ఇన్‌పుట్ సబ్సిడీ నివేదికను ప్రభుత్వానికి పంపుతారు. ఆ తర్వాత నిధులు ఏ రోజైన విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 31 కరువు మండలాలు

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో మొదటిసారిగా 2023-24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 30 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ఈ మండలాల పరిధిలోని రైతులకు రూ.460.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలైంది. 2023-24 రబీలో కూడ వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నాయి. దీనిని గుర్తించిన ప్రభుత్వం గతంలోనే కర్నూలు జిల్లాలో 18 మండలాలు, నంద్యాల జిల్లాలో 13 మండలాలు.. మొత్తంగా 31 కరువు ప్రాంతాలను గుర్తించింది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ రావడం వల్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను చేపట్టలేక పోయారు. అయితే పంట నష్టంపై ప్రభుత్వం ప్రాథమిక రిపోర్టు తీసుకుంది. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో తాజాగా ఎన్యూమరేషన్ ప్రక్రియ చేపట్టేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి.

కరువు రైతులను పట్టించుకోని చంద్రబాబు

చంద్రబాబు విభజిత రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలిస్తే వరుసగా 4ఏళ్లు కరువు వచ్చింది. ప్రతి ఏటా కరువు మండలాలను ప్రకటించారు. 2017-18 ఖరీఫ్‌లో 40 మండలాలు, రబీలో 37 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. ఖరీఫ్, రబీ కరువు మండలాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. 2019 మే నెల వరకు సీఎంగా కొనసాగిన చంద్రబాబు 2017-18 ఖరీఫ్, రబీ కరువు మండలాల రైతులుకు రూ.658 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2017-18 కరువు మండలాల ఇన్‌పుట్ సబ్సిడీని చంద్రబాబు ఎగ్గొట్టారు. దీన్నిబట్టి రైతులపై చంద్రబాబుకు ఎంత ప్రేమ ఉందో స్పష్టమవుతోంది.

70,982 హెక్టార్లలో పంట నష్టం

2023-24 రబీ కరువు మండలాలకు సంబంధించి వ్యవసాయ శాఖ యంత్రాంగం పంపిన ప్రాథమిక రిపోర్టు ప్రకారం 70,982.46 హెక్టార్లలో 33 శాతం పైన పంటలు దెబ్బతిన్నాయి. 18 కరువు మండలాల్లో 58,901 మంది రైతులు పంటలను నష్టపోయారు. ఈ రైతులకు రూ.71,57,64,304 ఇన్‌పుట్ సబ్సిడీ(పెట్టుబడి రాయితీ) అవసరమవుతుందని ప్రాథమిక నివేదికలో వ్యవసాయ యంత్రాంగం పేర్కొంది. తాజాగా ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేసి సోషల్ ఆడిట్‌కు పెట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా తుది నివేదికను పంపాలని ప్రభుత్వం ఆదేశించింది.

బ్యాంకుల వద్ద సందడి

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ చేయూత నగదు రైతులు, మహిళల ఖాతాల్లో జమచేసింది. దీంతో లబ్ధిదారులు నగదు డ్రా చేసుకునేందుకు బ్యాంకులకు వెళ్తున్నారు. ఆస్పరిలోని స్టేట్‌బ్యాంకు ఏర్పాటు చేసిన ఏడు సీఎస్‌పీ కేంద్రాల వద్ద సోమవారం సందడి కనిపించింది. రైతులు, మహిళలు బారులు తీరి దర్శనమిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారం డబ్బులు వేశారని హర్షం వ్యక్తం చేశారు.

రైతుల బ్యాంకు ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ

2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరువు మండలాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసే ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఏకంగా రూ.460.47 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 2023-24లో అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆయా జిల్లాల యంత్రాంగం పంపిన ప్రతిపాదనల మేరకు కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 24 మండలాలు, నంద్యాల జిల్లాలో 6 మండలాలను.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 30 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించింది. నంద్యాల జిల్లాలో బనగానపల్లి, మిడుతూరు, పగిడ్యాల, గడివేముల, బేతంచెర్ల, పాణ్యం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాల రైతులకు ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత కూడ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడం విశేషం.

మాటల్లో చెప్పలేని సంతోషం



పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ప్రభుత్వం కరువు రైతులకు ఉపశమనం కలిగించడం చాలా సంతోషంగా ఉంది. మా కుటుంబానికి రూ.39,900 ఇన్‌పుట్ సబ్సిడీ బ్యాంకు ఖాతాకు జమ అయింది. రబీలో 2.81 ఎకరాల్లో శనగ సాగు చేశాం. వర్షాభావం వల్ల పంట మొత్తం దెబ్బతినింది. రబీ కరువు రైతులను కూడా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడం ఎంతో ఊరటనిస్తోంది.

– గౌర మహేశ్వరరెడ్డి, ఏ. గోకులపాడు గ్రామం, కల్లూరు మండలం



కాలింగనర్ధనోత్సవంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

వైభవం.. అహోబిలేశుని ఉత్సవం



తొట్టి తిరుమంజనం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం కాళింగనర్ధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపారు. వేడుకల్లో భాగంగా జ్వాలానరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తొట్టి తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు తిరుమంజనం వస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పన్నీరుతో నింపిన వెండి తొట్టిలో సప్త నదులను ఆవాహం చేస్తూ ఉత్సవమూర్తుల పాదాలను అభిషేకించారు.

ఆశాజనకంగా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో నాలుగు , నంద్యాల జిల్లాలో 10 మండలాల్లో వర్షాలు కురిశాయి. కర్నూలు జిల్లా చిప్పగిరిలో 50.2 మిమీ, హాలహర్విలో 14.4, కర్నూలు అర్బన్‌లో 4.8, కర్నూలు రూరల్‌లో 3.8 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 40.1 మిమీ ఉండగా, 20 రోజుల్లో 80.7 మి.మీ. నమోదైంది. నంద్యాల జిల్లా మహానందిలో 28.8, రుద్రవరంలో 25.2, ఆళ్లగడ్డలో11.2, వెలుగోడులో 4.4, దొర్నిపాడులో 4.2, శ్రీశైలంలో 3.4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో మే నెల సాధారణ వర్షపాతం 36.9 మి.మీ. ఉండగా, 91.6 మి.మీ. నమోదైంది. రెండు జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

కందులు క్వింటా రూ.12,121

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులు క్వింటా ధర రూ.12,121 పలికాయి. సోమవారం కర్నూలు మార్కెట్‌కు 36 లాట్ల కందులు రాగా నాలుగైదు లాట్లు మినహా మిగిలిన అన్ని లాట్లకు రూ.12వేల పైనే ధర లభించింది. శనగలకు రూ.6,209, మినుములకు రూ.9,109, ఎండుమిర్చికి రూ.13,444, కొర్రలకు రూ.4,728 ప్రకారం ధర లభించింది. ఉల్లి గడ్డలు మార్కెట్‌కు రావడం లేదు.

24 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

- జూన్ 3వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 18,765 మంది విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. గతంలో మాదిరిగా కాకుండా సప్లిమెంటరీ రాసే వారిని కూడా రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించనున్నారు. పరీక్షలు నిర్వహణకు జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పది పబ్లిక్ పరీక్షలను 23,786 మంది రాయగా అందులో 20,367 మంది ఉత్తీర్ణత సాధించారు. వివిధ సబ్జెక్టుల్లో 18,765 మంది ఫెయిలయ్యారు. ఫిజికల్ సైన్స్‌లో 5,065, మ్యాథ్స్‌లో 4,969, తెలుగులో 2,934, హిందీలో 1896, ఇంగ్లిష్‌లో 1446 మంది, సోషియల్ స్టడీస్‌లో 2,455 మంది పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్లను పరీక్షల విభాగం వారు ఆయా పాఠశాలలకు పంపించారు.గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఫెయిలైన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు 27మంది, డిపార్టమెంట్ ఆఫీసర్లు 27మందితో పాటు ఇన్విజిలేటర్లు 500, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎస్.వి.ఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక టౌన్ మోడల్ కాలేజీలో పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు రాసేవారి కోసం 35 కేంద్రాలు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం 22 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు జరగనున్నాయని, 15,981 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నామని, 6,962 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్‌లో అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా, డీఈసీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి, లాలెప్ప, ప్రభుచరణ్ పాల్గొన్నారు.

బడిబస్సు భద్రమేనా?

- ఫిట్‌నెస్ లేకపోతే నిలుపుదల
- గడువు తీరిన వాటిని తిప్పితే సీజ్
- నిబంధనలు అతిక్రమిస్తే సర్వీసులు రద్దు
- జిల్లాలో 598 బస్సు సర్వీసులు
- ప్రారంభమైన ఫిట్‌నెస్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల బస్సుల విషయంలో ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఫిట్‌నెస్ లేకపోతే నిలుపుదల చేస్తోంది. వచ్చే నెల 12వ తేదీ నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ఆర్‌టీఏ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో వివిధ రకాల ప్రైవేటు విద్యాసంస్థలు 526 వరకు ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల విద్యార్థులు అధిక శాతం బస్సులోనే ప్రయాణం చేస్తుంటారు. అయితే బస్సు సామర్థ్యం సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందుకే ఏటా ఎంవీఐలు బస్సుల కండీషన్ పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంటారు. గత ఏడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగియడంతో 17వ తేదీ నుంచి కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది.

ఆన్‌లైన్‌లో తేదీల ఖరారు..

జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి నంద్యాలలోని రవాణా శాఖ కార్యాలయం సన్నద్ధమైంది. వాహనాలు ఎలా ఉండాలనే విషయంపై పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే తెలియజేశారు. వాహనం ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో పాఠశాల/కళాశాల యాజమాన్యాలు ఈ ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం రవాణా శాఖ కార్యాలయం వారు ఎఫ్‌సీ చేయించుకునేందుకు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొని వస్తే అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్ తనిఖీ చేస్తారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి..

ఏడాది క్రితం పొందిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) గడువు ఈ ఏడాది మే నెలలో ముగియనుంది. ఈనేపథ్యంలో ప్రతి పాఠశాల, కళాశాల యాజమాన్యులు తప్పకుండా ఎఫ్‌సీ పొందాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేయటంతో పాటు జరిమానాలు విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో 598కు పైగా బస్సులు

ఆర్‌టీఓ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 598కు పైగా పాఠశాల, కళాశాలల బస్సులు ఉన్నాయి. రూల్ నెంబర్ 185(ఎఫ్) ప్రకారం కచ్చితంగా ప్రతి స్కూల్, కళాశాలల యాజమాన్యం పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. దానిలో భాగంగా వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఆర్‌టీఓ అధికారులు పూర్తిస్థాయిలో అన్ని తనిఖీలు నిర్వహించిన తర్వాతే బస్సు రోడ్డెక్కేందుకు అనుమతి ఇస్తారు.



బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ అధికారి

నిబంధనలు ఇలా..

- 60 సంవత్సరాలు వయో పరిమితి దాటిన వ్యక్తి స్కూల్ బస్సు డ్రైవర్‌కు అనర్హుడు.
- డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగి చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి.
- డ్రైవర్‌ల నియామకాన్ని ఆర్‌టీఓ అధికారులకు తెలియజేయాలి. డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిస్టర్ చేయాలి. ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఉంచాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరం, బ్యాగులు భద్రపరుచుకునే బాక్సులు తప్పనిసరిగా ఉండాలి.
- ప్రతి బస్సులో ఒక అటెండర్ ఉండాలి. వాహనంలో ప్రయాణించే విద్యార్థుల వివరాలను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నోట్ చేసుకోవాలి. తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలను తెలియజేయాలి.

ఎఫ్‌సీ లేకుంటే సీజ్ చేస్తాం



స్కూల్ యాజమాన్యం బస్సుకు సంబంధించి కచ్చితంగా ఆర్‌టీఓ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) పొందాలి. ప్రభుత్వ అనుమతులు లేకుండా వాహనం రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకపోతే బస్సులు సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తాం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలి. వచ్చేనెల 15వ తేదీలోగా ఎఫ్‌సీ చేయించుకోవాలి. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ, పర్మిట్ లేని, కండీషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం. – శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

కేసుల నమోదు

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేయటంతో పాటు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. మే నెల నుంచి కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పిడుగు శబ్దానికి 12 పొట్టేళ్లు మృతి



ఆర్.కొత్తపల్లెలో మృతి చెందిన పొట్టేళ్లు

రుద్రవరం:ఆర్.కొత్తపల్లెలో ఆదివారం రాత్రి పిడుగు శబ్దానికి 12 పొట్టేళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొట్టాలపల్లె ఖాశీం సాహెబ్ అనే రైతు పొట్టేళ్ల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగానే 12 పొట్టేళ్లను ఆదివారం ఉదయం మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటి సమీపంలోని గుడిసెలో కట్టేశాడు. కాగా రాత్రి భారీ శబ్దంతో సమీపంలో పిడుగు పడింది. ఆ శబ్దానికి పొటేళ్లు అన్ని బెదిరి మృత్యువాత పడ్డాయి. బాధితుడికి దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి బాధిత రైతును పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయంగా అందించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ గిడ్డయ్య, వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ అక్కడికి చేరుకుని మృతి చెందిన పొట్టేళ్లకు పోస్టు మార్టం నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందేలా చూస్తామని వారు తెలిపారు.

పల్లెలకు ప్రగతి బాటలు

- ఉమ్మడి జిల్లాలో రూ.218.77 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణం
- రూ.183.23 కోట్ల నాబార్డు నిధులతో 38 పనులు
- 247 కిలోమీటర్ల మేర కొత్త రోడ్ల నిర్మాణం
- రూ.35.54 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో నాలుగు రోడ్లు, రెండు బ్రిడ్జీలు
- పల్లె ప్రజలకు తొలగనున్న రవాణా ఇబ్బందులు

కర్నూలు(అర్బన్): గుతుకులు పడిన రోడ్లు.. కంకర తేలి నడవడానికి వీలు లేని రహదారులు.. మోకాలి లోతు గుంతలతో నరకాన్ని తలపించే బాటలు.. ఇక ఉండబోవు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామీణ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దశాబ్దాలు అధ్వానంగా ఉన్న పల్లె బాటలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇందుకోసం నాబార్డు నిధులు రూ.183.23 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో 38 పనులకు అగ్రిమెంట్ కాగా.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 247 కిలో మీటర్ల మేర పల్లె రోడ్లు బాగుపడనున్నాయి. రోడ్లు సరిగా లేకపోవడం వల్ల అనేక కష్టనష్టాలను చవి చూసిన పల్లె ప్రజలు నేడు జరుగుతున్న పనులను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పీఎంజీఎస్‌వై కింద రూ.35.54 కోట్లతో నాలుగు గ్రామీణ రోడ్లు, రెండు బ్రిడ్జీల నిర్మాణాల పనులు కూడా ఊపందుకున్నాయి.



హొళగుంద - మార్లమడికి గ్రామాల మధ్య వేస్తున్న కొత్త రోడ్డు



కేజీ రోడ్డు నుంచి కోళ్లబావాపురం వరకు వేస్తున్న కొత్త రోడ్డు

పూర్తయిన పనులు ...

- రూ.4.80 కోట్లతో పారుమంచాల - మద్దూరు
- రూ.3.23 కోట్లతో పాములపాడు మండలంలోని కేజీ రోడ్ - వెలుగోడు
- రూ.4.40 కోట్లతో డీఆర్ రోడ్ - పెద్దపాయ (ప్యాపిలి మండలం)
- రూ.8 కోట్లతో డోన్ - గోవర్ధనగిరి (వయా ఆవులదొడ్డి)
- రూ.3.40 కోట్లతో ప్యాపిలి మండలం గుడిపాడు - పీఆర్ పల్లి

- ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాధాన్యత కలిగిన రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 12, నంద్యాల జిల్లాలో 26 రోడ్లను ప్రాధాన్యత కలిగిన రోడ్లుగా గుర్తించారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నిర్ణీత సమయంలోగా ఈ పనులను పూర్తి చేసేందుకు పీఆర్ ఇంజినీరింగ్ వర్గాలు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వేగంగా జరుగుతున్న పనుల్లో కొన్ని ...

- మద్దికెర నుంచి మొలగవెల్లి మీదుగా ఆలూరు వరకు రూ.8.15 కోట్లతో 14.90 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నారు.
- కోడుమూరు మండలం కర్నూలు - బళ్లారి ప్రధాన రహదారి నుంచి క్రిష్ణాపురం వరకు రూ.2.97 కోట్లతో 4.10 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు.
- కోడుమూరు మండలం వర్కూరు నుంచి మెరుగుదొడ్డి వరకు రూ.4.50 కోట్లతో 12.05 కిలోమీటర్ల మేర రోడ్డును వేస్తున్నారు.
- రూ.11.85 కోట్లతో చేపట్టిన కేజీ రోడ్ నుంచి కోళ్లబావాపురం వరకు వయా పడిదెంపాడు, పూడురు రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి.

అభివృద్ధి చెందనున్న 257.79 కిలోమీటర్లు ...

ఉమ్మడి జిల్లాలో నాబార్డు నిధులతో 247 కిలో మీటర్లు, పీఎంజీఎస్‌వై కింద 34 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి. ఈ రోడ్ల పనులు పూర్తి అయితే దాదాపు వంద గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.



శిరివెళ్ల - చందలూరు మధ్య వక్కిలేరు వాగుపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి

పీఎంజీఎస్‌వై కింద నాలుగు రోడ్లు, రెండు బ్రిడ్జీలు

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద ఉమ్మడి జిల్లాలో రూ.35.54 కోట్లతో నాలుగు గ్రామీణ రోడ్లు, రెండు బ్రిడ్జీల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలంలో శిరివెళ్ల - చందలూరు రోడ్డులో వక్కెరవాగుపై రూ.8.93 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. అలాగే బనగానపల్లె మండలం ఆకుమల్ల - బనగానపల్లె రోడ్డులోని పాలేరువాగుపై రూ.7.96 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పనులు సాగుతున్నాయి. ఈ పనులను పూర్తి నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు చెందిన అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఏఈ స్థాయి నుంచి డీఈఈ, ఈఈ, ఎస్ఈ వరకు వారంలో ఎవరో ఒక అధికారి ఈ పనులను పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నందున రోడ్ల పనుల వేగం పెరుగుతోంది. దశల వారీగా క్వాలిటీని సంబంధిత అధికారులు పరీక్షించిన అనంతరం మరో దశ పనులు చేపడుతున్నారు.

నిర్ణీత సమయంలో పూర్తి చేస్తాం




నాబార్డు, పీఎంజీఎస్‌వై కింద ఉమ్మడి జిల్లాలో 42 రోడ్లు, రెండు బ్రిడ్జీల పనులు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ఈ పనులను ప్రారంభించాం. ఎక్కడా కూడా జాప్యానికి చోటు లేకుండా ఈ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ఈ రోడ్ల పనులు పూర్తయితే అనేక గ్రామాల ప్రజల రవాణా సౌకర్యాలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ



గుట్టకొండ స్వామి దారిలో గాలికి విరిగి పడిన విద్యుత్ స్తంభం

గాలివాన బీభత్సం



రుద్రవరంలో కురుస్తున్న వర్షం

రుద్రవరం: మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎండ, ఉక్కపోతతో జనం అలమటించారు. సాయంత్రం 4గంటలు దాటగానే ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో భారీ ఈదురు గాలులతో గంటన్నర పాటు వర్షం కురిసింది. గాలి వానకు మండలకేంద్రం పట్టుపక్కల 10 విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే రెండు గంటల్లోనే అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే చెట్లు విరిగి రోడ్లపై పడటంతో ప్రయాణానికి ఆటంకం కలిగింది. భారీ వర్షం కురవడంతో పొలాల్లో వర్షపునీరు ప్రవహించింది.

కూలీలందరికీ పనులు కల్పించాలి

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం అమడగుంట్లలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేసి కూలీల హాజరు, పనుల వివరాలను పరిశీలించారు. అమడగుంట్ల గ్రామంలో 118 ఎస్సీ కుటుంబాలుంటే కేవలం 22 కుటుంబాలకే ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు కల్పించడం, కూలీలకు ఏప్రిల్ మాసంలో కేవలం 175 పనిదినాలే కల్పించి పనుల్లో పురోగతి లేకపోవడమేమిటంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఉపాధి పథకం కింద రైతు సాగు చేసిన నేరేడు చెట్లను ఏపీఓ మోదీన్‌బాషాతో కలిసి పీడీ పరిశీలించి సకాలంలో ఎరువులు, మందులు ఉపయోగించి చెట్ల ను సంరక్షించుకోవాలని సూచించారు. మండలంలో ఉపాధి పనుల్లోకి 3,700 మంది కూలీలు మాత్రమే వస్తున్నారని, ఈ సంఖ్యను 5 వేలకు పెంచాలని ఆదేశించారు.

చనుగొండ్లలో చిరుతలు



బయట సంచరిస్తున్న చిరుత పిల్ల



గుహ లోపల..

డోన్: చనుగొండ్ల గ్రామ సమీపంలోని కొండల్లో చిరుత పులులు, వాటి పిల్లలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా గ్రామ సమీపంలోని పెండేకల్లు రహదారిలో ఉన్న నల్లయేన (కొండ ప్రాంతం)లో రెండు పెద్ద చిరుతలతో పాటు పిల్ల కూనలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గొర్రెల కాపరులు, పశువుల కాపరులు చిరుత పులలను ప్రత్యక్షంగా చూసినట్లు తెలుస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చిరుత పిల్లలు గుహ నుంచి బయటకు వచ్చి సంచరిస్తుండటాన్ని కొందరు తీసిన వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ విషయంపై డోన్ ఫారెస్టు అధికారి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా చిరుతల సంచారం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

2012లో 70 మందిపై కేసు.. ఇదే చనుగొండ్ల గ్రామంలో 2012లో చిరుత పులి గ్రామ సమీపంలో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ విషయాన్ని అప్పట్లో అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించకపోవడంతో 2012 ఫిబ్రవరి 24 తెల్లవారుజామున ఉదయం చిరుత ఓ గొర్రెల మంద మీద దాడికి దిగడంతో కుక్కలు అడ్డగించాయి. దీంతో చెట్టుపైకి ఎక్కిన చిరుతను గుర్తించిన గొర్రెల కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. అక్కడికి ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో బెదిరిన చిరుత చెట్టు పైనుంచి కిందకు దూకింది. ఆ సమయంలో కుక్కలు వెంటపడి నిలువరించి గాయపరచడంతో గ్రామస్తుల చేతికి చిక్కింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఆలస్యంగా స్పందించి గ్రామానికి చేరుకున్నారు. బంధించిన చిరుతను స్వాధీనం చేసుకొని వైద్య సేవలు అందిస్తుండగా కోలుకోలేక మరణించింది. అప్పట్లో ఈ విషయమై అటవీ శాఖ అధికారులు 70మందికి పైగా గ్రామస్తులపై వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తాజాగా చిరుత పులుల సంచారం నేపథ్యంలో ఆ ఘటనను గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు.

నేడు పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 21న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పవర్ లిఫ్టింగ్ జిల్లా అధ్యక్షులు బి. వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి 31 వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9505157553ను సంప్రదించాలని సూచించారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన మూడేళ్ల చిన్నారి శ్రీవల్లికి అత్యంత అరుదైన సమస్య వచ్చింది. ఎడమవైపు మూత్రపిండం రెండుగా విడిపోయి ఒకదానిపై ఒకటి చేరింది. పైన ఉన్న మూత్ర పిండం మామూలుగా 15 శాతం పని చేస్తోంది. అందులో కూడా తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ ఏర్పడింది. దీంతో పాపకు పదే పదే జ్వరం రావడం, దుస్తుల్లోనే మూత్ర విసర్జన అవుతుండటంతో తల్లిదండ్రులు మొదట చిన్న ఆసుపత్రుల్లో చూపించి, అక్కడ ఫలితం లేకపోవడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పాపను పరీక్షించిన యురాలజిస్టు డాక్టర్ వై. మనోజ్‌కుమార్ విషయం తెలిసింది. పై భాగంలో ఉన్న మూత్ర పిండం బాగా వాచిపోయి,

ఆరోగ్యశ్రీ కింద చిన్నారికి అరుదైన చికిత్స

ఇన్‌ఫెక్ట్ అయ్యి పూర్తిగా పనిచేయని పరిస్థితికి చేరింది. దానికి తోడు మూత్రకోశంలోకి వెళ్లడానికి బదులు మూత్రనాళాల్లోకి మూత్రం లీక్ అవుతోంది. దానివల్లే పాపకు జ్వరం రావడం, ఇతర సమస్యలు తలెత్తాయి. ఈ పరిస్థితులన్నీ గమనించిన తర్వాత ఆ చిన్నారికి పై భాగంలో పాడైపోయిన మూత్రపిండాన్ని తీసేయాల్సి ఉంటుందని తేల్చారు. అయితే పాప వయస్సు మూడేళ్లు మాత్రమే కావడంతో రెండు వారాల క్రితం లాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్ర చికిత్స చేసి మూత్రపిండాన్ని తొలగించారు. ఇలాంటి శస్త్రచికిత్స చేయడానికి చాలా కష్టమని, ఎందుకంటే రెండు కిడ్నీలు ఒక దానితో ఒకటి హత్తుకుని ఉన్నాయని, దీనివల్ల పై కిడ్నీ తీసేటప్పుడు కింద కిడ్నీకి ప్రమాదం జరగకుండా తొలగించాల్సి ఉంటుందన్నారు. అది కూడా లాప్రోస్కోపితో కాబట్టి ఇంకా జాగ్రత్తగా చేయాల్సి వచ్చిందని తెలిపారు. చిన్నారికి వైద్యాన్ని పూర్తిగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. చిన్నారి పూర్తిగా కోలుకుని చురుగ్గా ఉందని ఆయన వివరించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



సూర్యతేజ భాను సుజ్ఞాన్ లక్ష్మీనరసింహ

కల్లూరు: ఎన్‌టీఏ వారు నిర్వహించిన జాతీయ స్థాయి బీఆర్క్ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్) పరీక్ష ఫలితాల్లో చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఐఐటీ–నీట్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. అకాడమీకి చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా క్యాటగిరీలో మంచి ర్యాంకులు సాధించారు. జి.సూర్యతేజ -51, ఎ.భాను సుజ్ఞాన్ – 123, కె.లక్ష్మీనరసింహ – 412 ర్యాంక్ సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ డి.రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు గ్రామీణ నిరుపేద కుటుంబాలకు చెందిన వారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు సహకరించిన అధ్యాపక బృందాన్ని అకాడమీ డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

సీబీఎస్ఈపై ఉపాధ్యాయులకు శిక్షణ

గోస్పాడు: సబ్జెక్టు ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్‌పై మండల కేంద్రమైన గోస్పాడులో జిల్లాలోని ఉపాధ్యాయులకు శిక్షణ సమావేశం మూడవ రోజు సోమవారం కొనసాగింది. డిప్యూటీ డీఈఓ బేగ్ శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎస్ఈపై మూడవ రోజు శిక్షణలో భాగంగా బయాలజీ, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్‌పై అవగాహన వస్తుందన్నారు. పాఠ్యాంశాలల్లో అనుసరించాల్సిన మెలకువలపై వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో సీబీఎస్ఈ అమలు చేసే చర్యలు చేపడుతుండటంతో ముందస్తుగా ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కమనీయం.. పాండురంగడి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



హనుమద్వాహనంపై పూజలందుకుంటున్న పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో సోమవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారి కల్యాణ మహోత్సవానికి ముందు ధ్వజపట ఆరాధన, ధ్వజారోహణం, ధ్వజపూజ, బేరిపూజ, సంప్రోక్షణ, హోమం, తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం చిత్తానక్షత్రమున ముత్యాల తలంబ్రాలు భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోక్షరణ మధ్య స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలోని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ శివారులోని పాటి అంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలు, తదితర వివాహ సామగ్రిని సమర్పించారు. రాత్రి పాండురంగడు హనుమద్వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 92 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షలకు 92 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 11,735 మందికి 10,804 మంది, డిగ్రీ స్పెషల్ సిప్లమెంటరీ పరీక్షలకు 153 మందికి 138 మంది, బీఈడీ మూడో సెమిస్టర్‌కు 2,700 మంది విద్యార్థులకు 2,494 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. బేతంచర్ల జ్ఞాన సరస్వతి డిగ్రీ కళాశాలలో 3, ఎమ్మిగనూరు సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో 2, ఆలూరు శ్రీ రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో 2, గూడూరు శ్రీ సాయి వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 1 చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

సమ్మర్ క్యాంప్‌లో కంప్యూటర్ శిక్షణ

కర్నూలు కల్చరల్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, అలయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. 4 నుంచి 8 సంవత్సరాల లోపు చిన్నారులకు డ్రాయింగ్, కంప్యూటర్ బేసిక్స్, పేపర్ క్రాఫ్టింగ్, 9 నుంచి 15 సంవత్సరాల లోపు వారికి సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, తెలుగు డీటీపీ, 15 సంవత్సరాలు పైబడిన వారికి ఫొటో షాప్, ఆఫీస్ అప్లికేషన్స్, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేషన్ తదితర అంశాల్లో 20 రోజులు పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీలోగా వీఆర్ కాలనీ మొదటి లైన్‌లోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. nyces.in వెబ్‌సైట్‌లో సైతం రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 93968 61308ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఇసుక తవ్వకాల్లో నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

సి.బెళగల్: ఇసుక తవ్వకాల్లో ప్రభుత్వ, సుప్రీం కోర్టు నిబంధనలు పాటించకపోతే ఇసుక రీచ్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ కలెక్టర్) చల్లా కల్యాణి, జిల్లా అధికారుల బృందంతో కలిసి సి.బెళగల్ మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాలైన కె.సింగవరం ఈర్లదిన్నె, ముడుమాల, పల్‌దొడ్డి గ్రామాల్లోని ప్రభుత్వ ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె నదిలోని రీచ్‌లలో ఇసుక లభ్యత, నీటి నిల్వలు, ఇసుక తరలింపు వివరాలను ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, మైనింగ్ డీడీ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులున్న ప్రాంతాల్లోని రీచ్‌లలో నిబంధనల మేరకే ఇసుక తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అక్రమాలపై జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందుకోసం మండల, స్థానిక అధికార యంత్రాంగంతో జిల్లా అధికారులు కమిటీ సమన్వయంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, స్థానిక వీఆర్‌ఏలు, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీఓ శేషిరెడ్డి, ఇరిగేషన్ ఈఈ కైలేశ్వర్, విజిలెన్స్ అధికారులు, స్థానిక తహసీల్దార్ అనుపమ, డీటీ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్, ఎస్ఐ తిమ్మారెడ్డి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.



సి.బెళగల్ మండలంలోని ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన, జేసీ మౌర్య, జిల్లా అధికారుల బృందం